**Sakshi**

# వెయ్యి పోస్టులకు 8 లక్షల దరఖాస్తులు

## గ్రూప్-2

సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి రాష్ట్రంలో ఎన్నడూ రాని విధంగా తెలంగాణలో గ్రూపు-2 పరీక్ష రాసేందుకు రికార్డు స్థాయిలో దరఖాస్తులు వచ్చాయి. 1,032 పోస్టుల భర్తీకి టీఎస్‌పీఎస్సీ ఈనెల 26 వరకు దరఖాస్తులను స్వీకరించగా, 8,18,926 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. చివరి గడువు సోమవారం అర్ధరాత్రితో ముగియడంతో కొంత మంది అభ్యర్థుల ఫీజు చెల్లింపు వివరాలు ఆయా బ్యాంకుల నుంచి ఇంకా అందలేదు. బుధ, గురువారాల్లో అవీ అందనున్నాయి. దరఖాస్తులతోపాటు ఫీజు చెల్లింపు వివరాలు అందిన అభ్యర్థులు 7,91,968 మంది ఉన్నారు. అందులో పురుషులు అత్యధికంగా దరఖాస్తు చేసుకున్నారు. మహిళల కంటే పురుషులు 1.80 లక్షల మంది ఎక్కువగా దరఖాస్తు చేసుకున్నారు. రిజర్వేషన్ కేటగిరీల వారీగా చూస్తే బీసీ-బీ అభ్యర్థులు అత్యధికంగా 1,85,625 మంది దరఖాస్తు చేశారు. బీసీ-డీ అభ్యర్థులు 1,60,567 మంది, ఎస్సీలు 1,58,640 మంది, ఓసీలు 1,11,847 మంది, ఎస్టీలు 72,280 మంది, బీసీ-ఏ అభ్యర్థులు 63,618 మంది, బీసీ-ఈ అభ్యర్థులు 33,837 మంది దరఖాస్తు చేసుకోగా, బీసీ-సీ అభ్యర్థులు 5,543 మంది దరఖాస్తు చేసుకున్నారు.

**జిల్లాల వారీగా దరఖాస్తులు**

| జిల్లా | దరఖాస్తులు |
|---|---|
| కరీంనగర్ | 1,15,315 |
| వరంగల్ | 1,06,930 |
| నల్లగొండ | 1,04,869 |
| మహబూబ్‌నగర్ | 81,938 |
| ఖమ్మం | 70,963 |
| హైదరాబాద్ | 63,170 |
| రంగారెడ్డి | 60,121 |
| ఆదిలాబాద్ | 60,977 |
| మెదక్ | 56,042 |
| నిజామాబాద్ | 48,015 |
| ఇతర రాష్ట్రాలు | 23,628 |

### ఏపీ నుంచి 11,346 మంది

ఇక ఏపీ నుంచి 11,346 మంది పరీక్ష రాసేందుకు దరఖాస్తు చేశారు. మహారాష్ట్ర, ఉత్తర్‌ప్రదేశ్, కర్ణాటక, బీహార్ రాష్ట్రాలకు చెందిన అభ్యర్థులు 200 నుంచి 300 మంది చొప్పున దరఖాస్తు చేశారు. కేరళ, మధ్యప్రదేశ్, తమిళనాడు అభ్యర్థులు ఒక్కో రాష్ట్రం నుంచి 100 మందికిపైగా దరఖాస్తు చేశారు. మొత్తంగా ఇతర రాష్ట్రాల వారు 23,628 మంది దరఖాస్తు చేసుకున్నారు.

### కరీంనగర్ నుంచి అత్యధికం

గ్రూపు-2 పరీక్ష రాసేందుకు దరఖాస్తు చేసిన అభ్యర్థుల్లో కరీంనగర్ నుంచి ఎక్కువ మంది (1,15,315) దరఖాస్తు చేసుకున్నారు. ఆ తర్వాత వరంగల్ నుంచి 1,06,930 మంది దరఖాస్తు చేసుకోగా, తక్కువ దరఖాస్తులు నిజామాబాద్ జిల్లా నుంచి 48,015 వచ్చాయి.